ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

తెలుగు దిన పత్రిక

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :239 సోమవారం జూన్ 22 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH

# డాక్యుమెంట్ రైటర్లతో తెర వెనుక ఒప్పందాలు

## నల్లగొండ జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో




●నల్లగొండ జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమాలు:?

●అధికారులడాక్యుమెంట్ రైటర్ల అక్రమ దందా బహిర్గతం ?

●నల్లగొండ జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం అవినీతి కేంద్రమా? సామాన్య ప్రజలపై దోపిడీ ఆరోపణలు... ?



నల్లగొండ జిల్లా పరిధిలోని సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం లో అక్రమాలకు అడ్డాగా మారిందన్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.




భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో నిబంధనలను పక్కన పెట్టి, భారీ మొత్తాల్లో అక్రమ వసూళ్లు జరుగుతున్నాయంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు...!

▶నేరుగా వెళ్తే సేవలు నిలిపివేత?మధ్యవర్తులతో మార్గం సులభం..

(తెలంగాణ స్టేట్ బ్యూరో ప్రత్యేక కథనం నల్లగొండ జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం)//మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక నిఘాలో భాగంగాకార్యాలయానికి నేరుగా వెళ్లిన వారికి పనులు జరగడం లేదని వినిపిస్తున్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. తప్పనిసరిగా ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్ల ద్వారా వెళ్లాల్సిందేనన్న పరిస్థితి నెలకొన్నట్లు బాధితులు చెబుతున్నారు..?.ఇది ప్రభుత్వ కార్యాలయమా లేక మధ్యవర్తుల ఆధీనంలో నడిచే ప్రైవేట్ వ్యవస్థనా?" అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.!ఆస్తి విలువల ఆధారంగా దంధా..?రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఆస్తి విలువల ఆధారంగా భారీ వసూళ్లు జరుగుతున్నాయని ఆరోపణలు.?కొద్దిమంది డాక్యుమెంట్ రైటర్లు కార్యాలయం పై పూర్తిగా ఆధిపత్యం చెలాయిస్తూ, అధికారులతో సన్నిహితంగా వ్యవహరిస్తూ వ్యవస్థను నియంత్రిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి రోజువారి వసూళ్ల దందా..సాయంత్రం కాగానే లెక్కలు.:!ప్రతి డాక్యుమెంట్‌ను గమనించి, ఏ రైటర్ ద్వారా వచ్చిందో నమోదు చేసి, 'ఫీజు టు ఫీజు' పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. సాయంత్రం సమయంలో ప్రత్యేకంగా వసూళ్ల లెక్కలు వేసి, రైటర్ల నుంచి డబ్బులు సేకరిస్తున్నారని బాధితులు అంటున్నారు?




▶ఇది ఓ పద్ధతిగా కొనసాగుతోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి!

ప్రజా ప్రతినిధుల అండ దండలు సామాన్యులకు న్యాయం ఎక్కడ సారు ?కొంతమంది డాక్యుమెంట్ రైటర్లు రాజకీయ నాయకులతో సన్నిహిత సంబంధాలు పెంచుకుని, అధికారులపై ప్రభావం చూపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ, న్యాయం కోసం తలుపులు తడుతున్నా ఫలితం కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




▶అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?

ఇన్ని ఆరోపణలు వెలుగులోకి వస్తున్నప్పటికీ, ఉన్నతాధికారుల స్పందన లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇది పర్యవేక్షణ లోపమా? లేక వ్యవస్థాగత వైఫల్యమా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ప్రభుత్వం తక్షణమే స్పందించి, పూర్తి స్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇంత వ్యవహారం జరుగుతున్న జిల్లాలో జాడ లేని విజిలెన్స్ మరియు అవినీతి నిరోధక శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని నల్లగొండ జిల్లా ప్రజలు కోరుతున్నారు వేచి చూడండి అతి త్వరలో మీ ముందుకు మరో సంచలనాత్మక కథనంతో మీ మా మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రికలో

ప్రశ్నించడం కోసం...?
RNI NO. TELTEL/2023/90455
# మన ప్రజాప్రతినిధి
ప్రజా ప్రతినిధి NEWS టీ.వి
తెలుగు దిన పత్రిక
ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :239 సోమవారం జూన్ 22 2026, పేజీలు - 4 వేల : 2/-
epaper.manaprajaprathinidhi.com
PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH

## తండ్రి కుటుంబానికి కనిపించని శక్తి...
## జీవితానికి దిశానిర్దేశం చేసే మార్గదర్శి

✦ప్రేమను మాటల్లో కాదు.. త్యాగాల్లో చూపించే మహోన్నత వ్యక్తిత్వం

జూన్ 21 (మనప్రజాప్రతినిధి): ప్రపంచంలో ప్రతి మనిషి జీవితంలో తల్లి తర్వాత అత్యంత కీలకమైన స్థానం తండ్రిదే. కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవడం మాత్రమే కాదు.. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే శిల్పిగా, జీవితానికి సరైన మార్గం చూపే మార్గదర్శిగా, కష్టకాలంలో ధైర్యాన్ని నింపే స్నేహితుడిగా తండ్రి ఎన్నో పాత్రలు పోషిస్తాడు. తల్లి ప్రేమ బయటకు కనిపిస్తే.. తండ్రి ప్రేమ ఎక్కువగా బాధ్యతల్లో, త్యాగాల్లో, కష్టాల్లో దాగి ఉంటుంది. కుటుంబ సభ్యులందరి సంతోషం కోసం తన కోరికలను,



అవసరాలను పక్కన పెట్టి జీవితాంతం శ్రమించే వ్యక్తి తండ్రి. పిల్లలు పుట్టిన క్షణం నుంచి వారి భవిష్యత్తు గురించి ఎక్కువగా ఆలోచించడం ప్రారంభించేది తండ్రే. మంచి విద్య, మంచి జీవితం, సమాజంలో గౌరవప్రదమైన స్థానం కల్పించాలనే లక్ష్యంతో ఎన్నో కష్టాలను భరిస్తాడు. తనకు ఎదురయ్యే సమస్యలను కుటుంబ సభ్యులకు తెలియనివ్వకుండా వాటిని ఒంటరిగా ఎదుర్కొంటాడు. కుటుంబం సుఖంగా ఉండాలంటే

2

## అపోలో ఆసుపత్రుల ఉపాధ్యక్షులతో కిషన్ రెడ్డి భేటీ

▫‘విశేష్ సంపర్క్ అభియాన్’లో భాగంగా సమావేశం
▫మోదీ పాలన విజయాలను వివరించిన కిషన్ రెడ్డి
▫ఆరోగ్య రంగ అభివృద్ధిపై చర్చలు



చెన్నై, జూన్ 21 (మనప్రజా ప్రతినిధి): కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ‘విశేష్ సంపర్క్ అభియాన్’ కార్యక్రమంలో భాగంగా ఆదివారం చెన్నైలో అపోలో ఆసుపత్రుల ఉపాధ్యక్షులు పి. విజయ్ కుమార్ రెడ్డి, ప్రీతా రెడ్డిలను కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర

2

## ప్రయాణికుల అప్రమత్తతతో తప్పిన ప్రమాదం



•ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సులో అగ్నిప్రమాదం
•సాంకేతిక లోపంతో చెలరేగిన మంటలు
•సురక్షితంగా బయటపడిన ప్రయాణికులు

2

## మూసీ విధ్వంసంపై... కేటీఆర్ ఫైర్

▫రాజేంద్రనగర్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం
▫కాంగ్రెస్, బీజేపీలపై తీవ్ర విమర్శలు
▫కసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తామన్న కేటీఆర్



రాజేంద్రనగర్, జూన్ 21 (మన ప్రజా ప్రతినిధి): రాజేంద్రనగర్‌లో నిర్వహిం చిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని సభ్యత్వ నమోదు కార్యక్రమం, ఓటర్ల జాబితా ప్రత్యేక

2

## ఆరోగ్యవంతమైన వృద్ధాప్యానికి యోగం



◆దేశవ్యాప్తంగా ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం
◆రసాయనాలు, ఎరువుల శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు
◆‘ఆరోగ్యవంతమైన వృద్ధాప్యానికి యోగం’ సందేశం

2

## విద్యార్థుల కోసం మోదీ నిరీక్షణ

•నీట్ పరీక్షకు ఆటంకం కలగకుండా నిర్ణయం
•45 నిమిషాలపాటు విమానాశ్రయంలోనే ప్రధాని
•విద్యార్థుల ప్రయోజనాలకే ప్రాధాన్యం



న్యూఢిల్లీ, జూన్ 21 (మనప్రజాప్రతినిధి): విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన కీలక పరీక్ష సమయంలో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ప్రత్యేక నిర్ణయం తీసుకున్నారు. కోల్‌కతాలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మధ్యాహ్నం ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న ఆయన వెంటనే తన అధికారిక నివాసానికి వెళ్లకుండా అక్కడే నిరీక్షించారు. సాధారణంగా ప్రధాని ప్రయాణాల సమయంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు ఉంటాయి. రహదారులపై ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల రాకపోకలపై తాత్కాలిక ఆంక్షలు విధించడం వంటి చర్యలు చేపడతారు. అయితే అదే సమయంలో దేశవ్యాప్తంగా నీట్ యూజీ పరీక్ష జరుగుతుండటంతో విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునే వేళ ఎలాంటి ఆటంకాలు ఏర్పడకూడదని భావించినట్లు తెలుస్తోంది. మధ్యాహ్నం 1.15 గంటలకు ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న ప్రధాని సుమారు 45 నిమిషాలపాటు అక్కడే ఉన్నారు. నీట్ పరీక్ష ప్రారంభ సమయం సమీపిస్తున్న నేపథ్యంలో తన కాన్వాయ్ ప్రయాణం వల్ల ట్రాఫిక్‌పై ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు సూచించినట్లు సమాచారం. దీంతో పరీక్ష రాసే విద్యార్థుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆయన వేచి ఉండాలని నిర్ణయించుకున్నారు.నీట్ పరీక్ష దేశంలోని అత్యంత కీలక ప్రవేశ పరీక్షల్లో ఒకటి. వైద్య విద్యలో ప్రవేశాల కోసం లక్షలాది మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతుంటారు. పరీక్షా కేంద్రాలకు నిర్ణీత సమయానికి ముందే చేరుకోవాల్సి ఉండటంతో రహదారులపై చిన్న అంతరాయం కూడా అభ్యర్థులకు ఇబ్బందులు కలిగించే అవకాశం ఉంటుంది. ఈ అంశాన్ని ప్రధాని పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. పరీక్ష మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైన తర్వాత మాత్రమే ప్రధాని విమానాశ్రయం నుంచి బయల్దేరి తన అధికారిక నివాసానికి వెళ్లారు. దీంతో పరీక్షా కేంద్రాలకు వెళ్లే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఇతర ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రధాని తీసుకున్న ఈ నిర్ణయం ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశంలో వారికి ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యవహరించిన ఈ ఘటనపై సామాజిక మాధ్యమాల్లో కూడా విస్తృతంగా స్పందనలు వ్యక్తమవుతున్నాయి.

## మోదీ పాలన విజయాలను వివరించిన పురందేశ్వరి

✦గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో ప్రత్యేక సమావేశం
✦అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన
✦వికసిత భారత్ లక్ష్యాలపై చర్చ



రాజమహేంద్రవరం, జూన్ 21 (మనప్రజాప్రతినిధి): రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ), జీఐఈటీ ఛాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజుతో పాటు యాజమాన్య బోర్డు డైరెక్టర్లు, అధ్యాపక సిబ్బందిని కలిసి కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా అమలవుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి పురందేశ్వరి వివరించారు. పేదల సంక్షేమం, మౌలిక వసతుల కల్పన, మహిళా సాధికారత, యువతకు అవకాశాల విస్తరణ వంటి అంశాల్లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రస్తావించారు. దేశ రక్షణ రంగంలో సాధించిన పురోగతి, స్వదేశీ ఉత్పత్తులకు ప్రోత్సాహం, అంతర్జాతీయ స్థాయిలో భారత ప్రతిష్ఠ పెరగడం వంటి అంశాలపై కూడా ఆమె చర్చించారు. ప్రపంచ ఆర్థిక సవాళ్ల మధ్య కూడా భారతదేశం స్థిరమైన వృద్ధిని కొనసాగిస్తోందని పేర్కొన్నారు.వికసిత భారత్ లక్ష్య సాధనకు విద్య, సాంకేతికత, పారిశ్రామిక రంగాల అభివృద్ధి కీలకమని పురందేశ్వరి అన్నారు. యువత నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు, డిజిటల్ సేవల విస్తరణ ద్వారా దేశం వేగంగా అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు మోదీ నాయకత్వంలో దేశం పలు రంగాల్లో సాధిస్తున్న పురోగతిని ప్రస్తావించినట్లు పురందేశ్వరి తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల రంగాల్లో జరిగిన మార్పులు దేశ ప్రగతికి దోహదపడుతున్నాయని అభిప్రాయాలు వ్యక్తమైనట్లు పేర్కొన్నారు. దేశ నిర్మాణంలో విద్యాసంస్థల పాత్ర ఎంతో కీలకమని పురందేశ్వరి అన్నారు. యువతలో జాతీయ చైతన్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడం ద్వారా వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో విశ్వవిద్యాలయ ప్రతినిధులు, అధ్యాపకులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



# తండ్రి కుటుంబానికి కనిపించని శక్తి జీవితానికి దిశానిర్దేశం చేసే మార్గదర్శి

మెదటి పేజీ తరువాయి

తాను ఎంత కష్టపడాల్సి వచ్చినా వెనుకాడడు. అందుకే తండ్రి ప్రేమ గొప్పదని పెద్దలు చెబుతుంటారు.సమాజ నిర్మాణంలో తండ్రుల పాత్ర అత్యంత కీలకమైనది. కుటుంబం అనే వ్యవస్థ బలంగా ఉండాలంటే తండ్రి బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. పిల్లలకు క్రమశిక్షణ, విలువలు, బాధ్యతలను నేర్పించడంలో తండ్రి పాత్ర అమూల్యమైనది. జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కోవాలో, విజయాన్ని ఎలా సాధించాలో, ఓటమిని ఎలా స్వీకరించాలో పిల్లలకు తండ్రే మొదటి గురువు. పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యను అందిస్తే, జీవిత పాఠాలను నేర్పేది తండ్రే. చాలామంది తండ్రులు తమ జీవితంలో అనేక కలలను వదులుకుని పిల్లల కలలను నిజం చేయడానికి కృషి చేస్తుంటారు. తమకు నచ్చిన వస్తువులు కొనకుండా, అవసరమైన ఖర్చులను తగ్గించుకుని పిల్లల చదువులకు, భవిష్యత్తుకు డబ్బు ఖర్చు చేస్తారు. కుటుంబ సభ్యుల అవసరాలు తీరిన తర్వాతే తమ గురించి ఆలోచిస్తారు. ఈ త్యాగాలు ఎక్కువగా బయటకు కనిపించకపోయినా, ప్రతి కుటుంబ విజయానికి వెనుక తండ్రి కష్టం, చెమట, అంకితభావం దాగి ఉంటాయి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం చేసే రైతు నుంచి మహానగరాల్లో ఉద్యోగాలు చేసే ఉద్యోగుల వరకు ప్రతి తండ్రి తన కుటుంబం కోసం శ్రమిస్తూనే ఉంటాడు. ఎండలు, వానలు, చలిని లెక్కచేయకుండా కష్టపడే రైతు తండ్రి కుటుంబానికి అన్నం అందిస్తాడు. ఉద్యోగి తండ్రి తన పిల్లలకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు రోజంతా శ్రమిస్తాడు. వ్యాపారవేత్తలు, కార్మికులు, డ్రైవర్లు, సైనికులు, పోలీసులు.. ఇలా ప్రతి వృత్తిలో ఉన్న తండ్రులు తమ కుటుంబం కోసం ఎంతో త్యాగం చేస్తున్నారు. నేటి ఆధునిక సమాజంలో తండ్రి పాత్ర మరింత విస్తరించింది. గతంలో ఎక్కువగా సంపాదించే వ్యక్తిగా మాత్రమే భావించిన తండ్రి, ఇప్పుడు పిల్లల పెంపకంలో ప్రత్యక్షంగా భాగస్వామి అవుతున్నాడు. పిల్లల చదువులు, ఆటలు, భావోద్వేగాలు, ఆరోగ్యం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాడు. పిల్లలతో సమయం గడుపుతూ వారితో స్నేహితుడిలా మెలుగుతున్న తండ్రుల సంఖ్య పెరుగుతోంది. ఇది కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేస్తోందని నిపుణులు చెబుతున్నారు. పిల్లల మానసిక వికాసంలో తండ్రి పాత్ర ఎంత ముఖ్యమో అనేక పరిశోధనలు వెల్లడించాయి. తండ్రితో సన్నిహిత సంబంధం ఉన్న పిల్లల్లో ఆత్మవిశ్వాసం ఎక్కువగా ఉంటుందని, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం మెరుగ్గా ఉంటుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. తండ్రి ప్రోత్సాహం పిల్లలకు ధైర్యాన్ని ఇస్తుంది. జీవితంలో పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే సంకల్పాన్ని పెంపొందిస్తుంది. తండ్రి ప్రేమను మాటల్లో చెప్పడం చాలా అరుదు. చాలామంది తండ్రులు తమ భావోద్వేగాలను బయటకు వ్యక్తపరచరు. కానీ వారి ప్రతి చర్యలో ప్రేమ కనిపిస్తుంది. పిల్లలకు ఏ చిన్న కష్టం వచ్చినా ఆందోళన చెందేది తండ్రే. పిల్లల విజయాలను చూసి మౌనంగా ఆనందించేది తండ్రే. వారి భవిష్యత్తు కోసం రాత్రింబవళ్లు ఆలోచించేది కూడా తండ్రే. అందుకే తండ్రి ప్రేమను అర్థం చేసుకోవాలంటే వారి జీవితాన్ని గమనించాల్సి ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడాది జూన్ నెలలో మూడో ఆదివారం తండ్రి దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ దినోత్సవం ద్వారా తండ్రుల సేవలను, త్యాగాలను గుర్తు చేసుకుంటారు. పిల్లలు తమ తండ్రులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ కృతజ్ఞతలు వ్యక్తం చేస్తారు. అయితే తండ్రిని గౌరవించడానికి ఒక్కరోజు సరిపోదని, ప్రతి రోజూ వారి సేవలను గుర్తుంచుకోవాలని సామాజికవేత్తలు సూచిస్తున్నారు. ప్రస్తుతం వేగంగా మారుతున్న జీవనశైలిలో కుటుంబ సభ్యులు ఒకరితో ఒకరు గడిపే సమయం తగ్గుతోంది. ఈ పరిస్థితుల్లో తండ్రిపిల్లల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. కుటుంబంతో సమయం గడపడం, పిల్లల భావాలను అర్థం చేసుకోవడం, వారికి అవసరమైన మద్దతు అందించడం ద్వారా తండ్రులు మరింత ప్రభావవంతమైన పాత్ర పోషించగలరని పేర్కొంటున్నారు.తండ్రి అనేది కేవలం ఒక బంధం కాదు.. ఒక భరోసా. కుటుంబానికి అండగా నిలిచే వటవృక్షం. కష్టాల్లో ధైర్యం చెప్పే స్నేహితుడు. విజయానికి మార్గం చూపే గురువు. ప్రేమను త్యాగాల్లో చూపించే మహోన్నత వ్యక్తిత్వం. అందుకే ప్రతి మనిషి జీవితంలో తండ్రి స్థానం ఎప్పటికీ ప్రత్యేకం, అపూర్వం, అమూల్యమైనదిగా నిలిచిపోతుంది.



# అపోలో ఆసుపత్రుల ఉపాధ్యక్షులతో కిషన్ రెడ్డి భేటీ

మెదటి పేజీ తరువాయి



ప్రభుత్వం గత 12 సంవత్సరాల్లో సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించే ప్రత్యేక పుస్తకాన్ని వారికి అందజేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పలు సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాల గురించి ఈ పుస్తకంలో వివరించినట్లు కిషన్ రెడ్డి తెలిపారు. దేశ అభివృద్ధిలో వివిధ రంగాల్లో నమోదైన పురోగతిని కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు. సమావేశంలో ఆరోగ్య రంగానికి సంబంధించిన పలు అంశాలపై చర్చలు జరిగినట్లు సమాచారం. దేశ ఆరోగ్య మౌలిక సదుపాయాల విస్తరణ, వైద్య సేవల అందుబాటు, ఆధునిక వైద్య సాంకేతికత వినియోగం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ భేటీ ఎంతో ఆహ్లాదకరంగా సాగిందని కిషన్ రెడ్డి సామాజిక మాధ్యమాల వేదికగా పేర్కొన్నారు. పరస్పర అభిప్రాయాల మార్పిడి, వివిధ అంశాలపై ఆలోచనాత్మక చర్చలు, విలువైన సూచనలు ఈ సమావేశంలో చోటుచేసుకున్నాయని వెల్లడించారు.వైద్య రంగంలో అపోలో ఆసుపత్రుల పాత్ర, దేశ ఆరోగ్య వ్యవస్థలో ప్రైవేటు రంగం భాగస్వామ్యం వంటి అంశాలపై కూడా చర్చ జరిగినట్లు తెలిసింది. ఆరోగ్య సేవలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల మధ్య సమన్వయం అవసరమని అభిప్రాయాలు వ్యక్తమైనట్లు సమాచారం. 'విశేష్ సంపర్క్ అభియాన్' కార్యక్రమం ద్వారా వివిధ రంగాల ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, వైద్య నిపుణులు, సామాజిక సేవకులను కలిసి కేంద్ర ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం కొనసాగుతున్నట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి.

# ప్రయాణికుల అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

మెదటి పేజీ తరువాయి




కరీంనగర్, జూన్ 21 (మన ప్రజాప్రతినిధి): కరీంనగర్-2 డిపోకు చెందిన ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సులో ఆదివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు ప్రయాణిస్తున్న సమయంలో తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ సమీపంలో ఈ ఘటన జరిగింది. బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ప్రాథమిక సమాచారం ప్రకారం బస్సులో సాంకేతిక లోపం ఏర్పడటంతో మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. బస్సు వెనుక భాగం నుంచి పొగలు రావడం గమనించిన డ్రైవర్ వెంటనే వాహనాన్ని రోడ్డుపక్కన నిలిపివేశారు. పరిస్థితిని అంచనా వేసిన సిబ్బంది ప్రయాణికులను అప్రమత్తం చేశారు. డ్రైవర్, కండక్టర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సులో ఉన్న ప్రయాణికులందరినీ వెంటనే కిందికి దించారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. బస్సులో ఉన్న వారంతా సురక్షితంగా బయటపడటంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.అయితే మంటలు వేగంగా వ్యాపించడంతో బస్సు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. స్థానికులు, ప్రయాణికులు మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. అనంతరం సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటన కారణంగా కొంతసేపు ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించి పరిస్థితిని చక్కదిద్దారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించిన అధికారులు వివరాలను సేకరించారు. అగ్నిప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఎలక్ట్రిక్ బస్సులోని బ్యాటరీ వ్యవస్థలో లోపమా లేదా ఇతర సాంకేతిక కారణాల వల్ల ప్రమాదం జరిగిందా అనే కోణంలో విచారణ కొనసాగుతోంది. ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరట కలిగించే అంశంగా నిలిచింది.

# మూసీ విధ్వంసంపై...కేటీఆర్ ఫైర్

మెదటి పేజీ తరువాయి



సవరణ ప్రక్రియపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయాలు, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు, కాంగ్రెస్, బీజేపీల వైఖరిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మూసీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం విధ్వంసకర రాజకీయాలు చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. గాంధీ పేరును ప్రస్తావిస్తూ పేదల ఇళ్లను కూల్చడం సరైన చర్య కాదన్నారు. గాంధీపై నిజమైన గౌరవం ఉంటే పేదలకు న్యాయం చేయాలని, వారి నివాసాలను కాపాడాలని సూచించారు. ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా ప్రభుత్వం ముందుకెళ్తోందని విమర్శించారు.మూసీ ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి బీజేపీ కూడా మద్దతు ఇస్తోందని కేటీఆర్ ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పేదల భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తున్నాయని అన్నారు. స్థానిక బీజేపీ నేతలు ఒకలా మాట్లాడుతున్నా, కేంద్ర ప్రభుత్వం మాత్రం భిన్నంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల అమలుకు నిధులు లేవని చెబుతూనే మూసీ ప్రాజెక్టు కోసం భారీ మొత్తంలో నిధులు ఖర్చు చేయడానికి సిద్ధమవుతోందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన ప్రభుత్వం అభివృద్ధి పేరుతో ఇతర కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు.రాజేంద్రనగర్ నియోజకవర్గ రాజకీయాలపై కూడా కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ తరఫున గెలిచిన నాయకులు పార్టీ మారినా ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదన్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. పార్టీ నుంచి కొందరు నేతలు వెళ్లిపోయినప్పటికీ బీఆర్ఎస్ బలహీనపడలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. గులాబీ సైన్యం రాష్ట్రవ్యాప్తంగా బలంగా ఉందని, రానున్న ఎన్నికల్లో కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా చేసి బీఆర్ఎస్ జెండాను ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ శాసనమండలి చైర్మన్ స్వామి గౌడ్, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



# ఆరోగ్యవంతమైన వృద్ధాప్యానికి యోగం

మెదటి పేజీ తరువాయి



న్యూఢిల్లీ,జూన్ 21 (మన ప్రజాప్రతినిధి): కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వశాఖ పరిధిలోని రసాయనాలు, పెట్రోరసాయనాల విభాగం ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అనుబంధ సంస్థలు, కార్యాలయాలు, పరిశోధనా కేంద్రాలు ఉత్సాహంగా ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నాయి. ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని "ఆరోగ్యవంతమైన వృద్ధాప్యానికి యోగం" అనే ప్రధాన అంశంతో నిర్వహించారు. వయసు పెరిగే కొద్దీ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో యోగ సాధన ఎంతగానో ఉపయోగపడుతుందనే సందేశాన్ని ప్రజలకు చేరవేయడమే లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టారు.దేశవ్యాప్తంగా నిర్వహించిన యోగా శిబిరాల్లో అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, పరిశోధకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం వంటి సాధనల ద్వారా ఆరోగ్యకర జీవనశైలిని అలవరచుకోవాలని నిపుణులు సూచించారు. ఆధునిక జీవనశైలిలో ఒత్తిడి, అనారోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో యోగం శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతను కూడా అందిస్తుందని కార్యక్రమంలో పాల్గొన్నవారు పేర్కొన్నారు. ముఖ్యంగా వృద్ధాప్యంలో చురుకుదనం, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో యోగం కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు.రసాయనాలు మరియు పెట్రోరసాయనాల విభాగానికి చెందిన వివిధ సంస్థలు తమ తమ కేంద్రాల్లో ప్రత్యేక యోగా కార్యక్రమాలను నిర్వహించాయి. ఉద్యోగుల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణకు యోగాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చాయి. ప్రపంచ వ్యాప్తంగా యోగానికి పెరుగుతున్న ఆదరణ భారతీయ సంస్కృతికి దక్కిన గౌరవమని పలువురు అభిప్రాయపడ్డారు. ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో యోగం కీలక సాధనమని పేర్కొంటూ ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో యోగాభ్యాసాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు.



# కాళికా మాతను దర్శించుకున్న మహమ్మద్ రఫీ...



మన ప్రజప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట జూన్ 21:ఆదివారం వెల్దుర్తి మండలంలో జలాల్పూర్ గ్రామంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాళికామాత దేవాలయం వద్ద నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు,వన మహోత్సవ కార్యక్రమంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మి రెడ్డి తో కలిసి,కార్యక్రమం పాల్గొన్న ప్రముఖ సంఘ సేవకులు,చేగుంట ఉపసర్పంచ్ మొహమ్మద్ రఫీ, అనంతరం తమ యొక్క నక్షత్రం ప్రకారం తన నక్షత్రంతో ఉన్న మొక్కను నాటి వేద పండితుల ఆశీర్వాదాలు తీసుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి రమేష్ గౌడ్,మండల పార్టీ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి,వెల్దుర్తి మాజీ సర్పంచ్ వెన్నవరం మోహన్ రెడ్డి,మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ కోదండ కృష్ణ గౌడ్ వెన్నవరం శ్రీనివాస్ రెడ్డి ప్రతాపరెడ్డి జగ్గా అశోక్ గౌడ్ సర్పంచులు రంగారెడ్డి,రంగి కృష్ణ,సాయిలు, చేగుంట మాజీ పిఏసిఎస్ ఛైర్మన్ అయిత రఘురాములు, పాల్గొన్నారు

# యోగా గురువు ఏనుగుల శ్రీనివాసు ను సన్మానం చేసిన బిజెపి నాయకులు



మన ప్రజాప్రతినిధి/మనకొండూరు తేదీ 21 జూన్:ఇల్లంతకుంట మండల కేంద్రంలోని వారసంత ప్రదేశంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ను యోగా గురువు ఏనుగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు.యోగా గురువు ఆసనాలు వేయించి యోగా,ఆసనము,సూర్య నమస్కారం చేయించడం జరిగింది.యోగా అనంతరం యోగాసనాలు నేర్పించిన యోగా గురువు ఏనుగుల శ్రీనివాస్ ను సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమానంతరం యోగాలో పాల్గొన్న సభ్యులందరూ రాగి జావను సేవించడం జరిగింది. యోగా దినోత్సవ కార్యక్రమంలో ఇల్లంతకుంట భాజపా మండల అధ్యక్షులు భూమల్ల అనిల్ కుమార్ , బిజెపి కౌన్సిల్ మెంబర్ బత్తిని సాయి గౌడ్ , సీనియర్ నాయకులు మేకల మల్లేశం మండల కార్యదర్శి లంకోజు చంద్రం మండల కోశాధికారి పిల్లి గోపాల్ కార్యవర్గ సభ్యులు తుమ్మనపల్లి కమలాకర్ రావు గ్రామస్తులు పాల్గొన్నారు.

# పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఘనంగా యోగా వేడుకలు



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:పోలీస్ కమిషనర్ కార్యాలయం ఖమ్మంఅంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఘనంగా యోగా వేడుకలు నిర్వహించారు. జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లోని పోలీసు పరేడ్ గ్రౌండ్స్ లో పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి సామూహికంగా యోగాసనాలు, ప్రాణాయామం చేశారు.నిరంతరం శాంతిభద్రతల పరిరక్షణ, విధుల్లో ఉండే పోలీసులకు యోగా వల్ల శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత చేకూరుతాయని ఏ ఆర్ ఏసీపీ నర్సయ్య అన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది నిత్యం యోగా సాధన చేయడం ద్వారా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అవగాహన కల్పించారు.ఆర్ ఐ లు కామరాజు, శ్రీశైలం, సురేష్,నాగుల్ మీరా, యోగ ఉపాధ్యాయులుకూచన సుష్మిత,తోకచిచ్చు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ నరసింహ ఐపిఎస్



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక సూర్యాపేట జిల్లా:సూర్యాపేట జిల్లా కేంద్రంసూర్యాపేట పట్టణంలో నీట్ పరీక్ష నిర్వహిస్తున్న తెలంగాణ రెసిడెన్షియల్ సోషల్ వెల్ఫేర్ గురుకుల మహిళా కళాశాల నందు పరీక్షా కేంద్రాన్ని ఎస్పి నరసింహ ఐపిఎస్ సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రం వద్ద పోలీస్ బందోబస్త్ ఏర్పాట్లను పరిశీలించడంతో పాటు, పరీక్షకు హాజర్ అవుతున్న విద్యార్థులతో మాట్లాడి శుభాకాంక్షలు తెలిపినారు. బందోబస్తు వివరాలు, విద్యార్థుల హాజరు వివరాలను స్థానిక డిఎస్పీ ప్రసన్న కుమార్ ను అడిగి తెలుసుకున్నారు, పరీక్ష అనంతరం పరీక్ష పత్రాలను తరలించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్పి పలు సూచనలు చేశారు

# ప్రశాంతంగా నీట్ పరీక్ష



మన ప్రజాప్రతినిధి తెలుగుదినపత్రిక సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్జిల్లాలో ఐదు సెంటర్లలో 763 మంది హాజరు నీట్ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. జిల్లాలో మొత్తం ఐదు సెంటర్లలో పరీక్ష నిర్వహించినట్లు వెల్లడించారు. జిల్లాలో మొత్తం 908 మంది విద్యార్థులకు గాను 763 మంది విద్యార్థులు హాజరు కాగా 145 మంది విద్యార్థులు ఎ హాజరయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు నిర్వహించినట్లు తెలిపారు.

# సామాజిక సమరసత సాధించడం సద్భావన ఉద్దేశం

- కుటుంబ విలువలను పాటించడం
- పర్యావరణ ను సంరక్షించడం
- పౌర విధులను కాపాడటం
- స్వదేశీ భావనను పెంపొందించడం
- ఆర్ఎస్ఎస్ కరినగర్ జిల్లా సహా సంఘ్ చాలక్ ఎలగందుల సత్యనారాయణ



మనప్రజాప్రతినిధి/మనకొండూరు తేదీ 21 జూన్ :ఇల్లంతకుంట మండల కేంద్రంలోని జలపతి రెడ్డి ఫంక్షన్ హాల్ లో సామాజిక సద్భావన ఖండ సంయోజక్ అయ్యన్న గారి హరికృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో సామాజిక సమరసత సదస్సు లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కరి నగర్ జిల్లా సహా సంఘ్ చాలక్ ఎలగందుల సత్యనారాయణ పాల్గొన్నారు. ఇల్లంతకుంట మండలంలోని 10 గ్రామాల నుండి కుల సంఘాల పెద్దలు పాల్గొన్నారు అని హరికృష్ణ రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా ఎలగందుల సత్యనారాయణ మాట్లాడుతూ సమాజంలో సామాజిక పరివర్తన రావాలి అంటే సామాజిక దృక్పథం గల కుల సంఘాల పెద్దలు ప్రజల దగ్గరికి వెళ్లి మార్పు తీసుకురావాలని కోరారు. సమాజంలోని ప్రజలందరూ పంచ పరివర్తనను పాటించే విధంగా అలవాటు చేయాలని పిలుపునిచ్చారు.కులాలకు అతీతంగా దేవాలయాల్లో అందరికీ ప్రవేశం ఉండే విధంగా చూడాలని కోరారు. రాబోయే రోజుల్లో పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మన అందరి పైన బాధ్యత ఉందన్నారు. రాజ్యాంగ చట్టాలను ప్రతి ఒక్కరూ పాటించాలని తెలిపారు.స్వదేశీ వస్తువులను ఉపయోగించడం వల్ల దేశం యొక్క ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కరినగర్ జిల్లా పర్యావరణ ప్రముక్ బత్తిని ఆంజనేయులు, ఇల్లంతకుంట ఖండ కార్యవాహ తాటిపల్లి మహేష్, సహ కార్యవాహ కాసుపాక కిషన్, వ్యవస్థ ప్రముక్ బొల్లం ధనుంజయ్, బౌద్ధిక్ ప్రముక్ నాగ సముద్రాల బాలకృష్ణ, వివిధ గ్రామాల సామాజిక సద్భావన సభ్యులు పాల్గొన్నారు.

# అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో థైరాయిడ్ పరీక్ష నిర్వహణ




మన ప్రజాప్రతినిధి/మనకొండూరు తేదీ 21 జూన్ :ఫాదర్స్ డే నే పురస్కరించుకొని కరీంనగర్ జిల్లాలోని వాసుదేవ హాస్పిటల్ డాక్టర్ ఎలగందల శ్రీనివాస్, అలయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ 137 ఏ ఆధ్వర్యంలో ఉచిత థైరాయిడ్ పరీక్షలు వాసుదేవా హాస్పిటల్ లో నిర్వహించడం జరిగింది . ఇల్లంతకుంట మండల కేంద్రంలోని కీర్తిశేషులు అల్లాడి ఆంజనేయ శర్మ జ్ఞాపకార్థం ఉచిత థైరాయిడ్ పరీక్షలు అతని స్వగృహమునందు నిర్వహించడం జరిగింది. అలాగే మండలంలోని రహీమ్ ఖాన్ పేట గ్రామంలో కొత్త అలయన్స్ క్లబ్ ఇన్స్టాలేషన్ చేయడం జరిగింది, దానిలో భాగంగా అక్కడ ఉచిత థైరాయిడ్ పరీక్షలు నిర్వహించడం జరిగింది . డాక్టర్ ఎలగందల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి ఉచిత స్క్రీనింగ్ క్యాంపులు అందుబాటులోకి తీసుకువస్తానని చెప్పారు,ఈ ఉచిత క్యాంప్లో పాల్గొన్న వాళ్లందరికీ కూడా మూడు నెలల వరకు ఎటువంటి ఫీజు లేకుండా ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తానని ఏదైనా అవసరమున్న టెస్టులు ఇంకా ఏమైనా ఉంటే దానిలో చాలా వరకు తగ్గించి పరీక్షలు చేస్తానని డాక్టర్ శ్రీనివాస్ చెప్పారు, ఈరోజు వాసుదేవ హాస్పిటల్ లో 50 శాంపిల్స్ ఇల్లంతకుంటలో 70 శాంపిల్స్ రహీంఖాన్ పేటలో 35 శాంపిల్స్ తీసుకోవడం జరిగింది . ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎలగందల శ్రీనివాస్ ,డాక్టర్ సునీల్ రాజ్ ,డాక్టర్ అశోక్ ,డాక్టర్ సాయి మేఘన ,డాక్టర్ తేజ వాసుదేవా హాస్పిటల్ సిబ్బంది అలయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కొంజర్ల మహేష్ ఇంజనీర్ ,కోల అన్నారెడ్డి ,పుల్లల శ్యామ్ ,వి డి జి వన్ ప్రసాద్ ,సాగర్ ,పండుగ నాగరాజు ,కుమారస్వామి ,నాగేశ్వర్ ,వెంకటేశ్వర్లు జెడ్ సి చైర్మన్ అల్లాడి ఆనంద్ కుమార్, క్లబ్ అధ్యక్షులు గడ్డమీది శ్రీనివాస్, సెక్రటరీ ఉత్కం రాజేందర్, ట్రెజరీదొంతి అశోక్ , పి ఆర్ ఓ కముటం పర్శరాములు ,అంతగిరి వినయ్, హాస్పిటల్ సిబ్బందితదితరులు పాల్గొన్నారు.

# నీట్-యూజీ 2026 పరీక్ష కేంద్రాలను సందర్శించిన పోలీస్ కమిషనర్



మన ప్రజాప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:పోలీస్ కమిషనర్ కార్యాలయం ఖమ్మం వైద్య, విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం ఖమ్మం పోలీస్ కమిషనరేట్ లో నిర్వహించే నీట్-యూజీ 2026 పరీక్షల నేపథ్యంలో ఆయా పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పటిష్ట పోలీస్ బందోబస్త్, భద్రతను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించి, పరిశీలించారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 అంక్షలు అమలులో ఉంటుందన్నారు.శాంతి నగర్ కాలేజ్ సందర్శించిన పోలీస్ కమిషనర్ టౌన్ ఏసీపీ రమణమూర్తి కి పలు సూచనలు చేశారు.

# యోగాతో మానసిక ఒత్తిడి దూరం




మన ప్రజాప్రతినిధి తెలుగుదినపత్రిక సూర్యాపేట జిల్లా: సూర్యాపేటసూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం, సిబ్బందితో కలిసి యోగా చేసిన ఎస్పీ నర్సింహా ఐపీఎస్. సామర్థ్యంతో విధులు ఎస్పీఅంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రోజు సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కోసం ప్రతి ఒక్కరూ యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం సాగింది. ఈ యోగా కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నర్సింహా ఐపీఎస్ స్వయంగా పాల్గొని, పోలీస్ సిబ్బందితో కలిసి వివిధ రకాల ఆసనాలు, ప్రాణాయామం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం ఒత్తిడితో కూడిన విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందికి యోగా ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. యోగా ద్వారా మానసిక ప్రశాంతత లభించడమే కాకుండా, వృత్తిపరమైన బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి అవసరమైన శక్తి లభిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీఎస్పీలు ప్రసన్నకుమార్, నరసింహ చారి, సీఐలు వెంకటయ్య, రాజశేఖర్, ఆర్ఐలు ప్రవీణ్, జానయ్య, ఎస్సై లు, ఆర్ ఎస్సై లు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొని యోగాసనాలు వేశారు.

# ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదు... జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



మన ప్రజాప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:యోగాతో ఆరోగ్యండ ఆరోగ్యంతో అందమైన జీవితం దైనందిన జీవితంలో యోగ ఒక భాగం కావాలి ప్రపంచ యోగా దినోత్సవంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఖమ్మం ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదని, యోగాతో ఆరోగ్యం సాధ్యమ వుతుందని, ఆరోగ్యంతో అందమైన జీవితం సాధ్యపడుతుందని, ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో యోగాను ఒక భాగంగా అలవర్చు కోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. ఆదివారం స్థానిక సర్దార్ పటేల్ స్టేడియంలో ఆయుష్, క్రీడల శాఖల ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం 2026 కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ స్వయంగా యోగా ఆసనాలు చేస్తూ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, యోగ అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, క్రమశిక్షణతో కూడిన జీవన విధానమని అన్నారు.యోగా దినమున జరిగే కార్యక్రమంలో ఆయుష్ శాఖ వారు పాల్గొనేవారని, ఇక్కడ పౌర సమాజం నుండి పెద్ద సంఖ్యలో పాల్గొనడం శుభసూచకమని అన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు కార్యక్రమంలో పాలుపంచుకుంటున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని తెలిపారు. ప్రస్తుత కాలంలో మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, సాంకేతిక సౌకర్యాల పెరుగుదల కారణంగా మనిషి శారీరక శ్రమకు దూరమవుతూ అనేక రకాల అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని అన్నారు. ప్రతి మనిషికి ఉన్న అత్యంత విలువైన ఆస్తి ఆరోగ్యం అని, ఆరోగ్యం బాగోలేకపోతే జీవితంలో ఎంత సాధించినా దానిని పూర్తిగా ఆస్వాదించలేమని తెలిపారు. ఆరోగ్యంగా ఉండటమే ప్రతి వ్యక్తి జీవితానికి బలమైన పునాది అని కలెక్టర్ అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, ఉప వైద్యాధికారి డా. వేణుమాధవ్, నోడల్ అధికారిణి డా. పద్మావతి, నేచురోపతి డాక్టర్ కనకమహాలక్ష్మి, జిల్లా అధికారులు, విద్యార్థులు, యువత, మహిళలు, యోగా సాధకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# యువత చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలి
## ప్రముఖ వ్యాపారవేత్త చౌడం నవీన్ కిషన్



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట జూన్ 21: క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దా ం ు ద ్య ని కి దోహదపడతాయని ప్రముఖ వ్యాపారవేత్త ధరణి జియోస్ పాటిల్ చైర్మన్ చౌడం నవీన్ కిషన్ తెలిపారు. అదివారం అన్నంతసాగర్ గ్రామ శివారులో నిర్వహించిన క్రికెట్ సీజన్ 2 చాంపియన్ షిప్ 2025-26 పురుషులు, క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమంలో పాల్గొని గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించి, గ్రామానికి, మండలనికి, జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. ప్రతి ఓటమి మరో గెలుపునకు నాంది పలుకుతుందని, పోటీల్లో ఓడిన వారు నిరుత్సాహం చెందకుండా రాబోయే ఆటల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. విద్య అనేది మనిషికి జ్ఞానాన్ని ఇచ్చి ఎలా మెరుగుపరుస్తుందో అదే విధంగా క్రీడలు కూడా మన జీవితానికి ఎన్నో పాఠాలు నేర్పిస్తాయన్నారు. విద్యతో పాటు క్రీడలు కూడా మనలో భాగస్వామ్యం అయినప్పుడు పరిపూర్ణత గల మనిషిగా అభివృద్ధి చెందుతారన్నారు మూడు రోజుల నుంచి జరుగుతున్న క్రికెట్ క్రీడా పోటీల్లో బి ఎన్ ఆర్ రాయల్స్, ఎన్ ఆర్ గ్లాడియేటర్స్, రాము వారియర్స్, మరాఠ, రాయల్స్, జిటీ వారియర్స్, జట్లు తడపడగా , ఫైనల్ లో బిఎన్ఆర్ రాయల్స్, రాము వారియర్స్ రాము వారియర్స్ గెలుపొందడం జరిగిందని తెలిపారు, క్రీడాకారులు హాజరై స్నేహపూరిత వాతావరణంలో ఈ క్రీడలు విజయవంతంగా జరపడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

# రెండు నిమిషాల ఆలస్యం...
# కన్నీరు పెట్టించిన తండ్రి వేడుకోలు



హైదరాబాద్, జూన్ 21 (మనప్రజాప్రతినిధి): నీట్ రీటెస్ట్ పరీక్షకు హాజరయ్యేందుకు వచ్చిన ఓ విద్యార్థిని కేవలం రెండు నిమిషాలు ఆలస్యంగా పరీక్షా కేంద్రానికి చేరుకోవడంతో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. పరీక్షకు అనుమతించాలని కోరుతూ ఆమె తండ్రి పోలీసుల కాళ్లపై పడి వేడుకున్న సంఘటన హైదరాబాద్‌లో తీవ్ర భావోద్వేగానికి గురిచేసింది. విద్యార్థిని కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, పరీక్షా కేంద్రానికి వెళ్లే సమయంలో గూగుల్ మ్యాప్స్ తప్పుదారి చూపడంతో సమయానికి చేరుకోలేకపోయారు. మార్గం తప్పిపోవడంతో విలువైన సమయం వృథా అయిందని, అందువల్లే పరీక్షా కేంద్రానికి ఆలస్యంగా చేరుకున్నామని తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు.పరీక్షా కేంద్రం వద్దకు చేరుకున్న వెంటనే కుమార్తెను లోపలికి అనుమతించాలని అధికారులు, పోలీసులను ఆయన వేడుకున్నారు. కేవలం రెండు నిమిషాల ఆలస్యమే జరిగిందని, విద్యార్థిని భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అవకాశం ఇవ్వాలని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ క్రమంలో పోలీసుల కాళ్లపై పడి తన బాధను వ్యక్తం చేశారు. అయితే పరీక్షా నిబంధనల ప్రకారం నిర్ణీత సమయం దాటిన తర్వాత అభ్యర్థులను లోపలికి అనుమతించే అవకాశం లేదని అధికారులు స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో విద్యార్థిని, ఆమె కుటుంబ సభ్యులు తీవ్ర నిరాశకు గురయ్యారు.ఈ ఘటన అక్కడున్న పలువురిని కలచివేసింది. పోటీ పరీక్షల్లో సమయపాలనకు అత్యంత ప్రాధాన్యం ఉన్నప్పటికీ, కేవలం రెండు నిమిషాల ఆలస్యం కారణంగా ఒక విద్యార్థి అవకాశాన్ని కోల్పోవడం బాధాకరమని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సంఘటన ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చనీయాంశంగా మారింది. పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నప్పటికీ, అనివార్య పరిస్థితుల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# నాన్నే జీవితానికి తొలి ఆదర్శం అనిత

-ఫాదర్స్ డే సందర్భంగా హోంమంత్రి సందేశం
-తండ్రి త్యాగాలు వెలకట్టలేనివని వ్యాఖ్య
-ప్రతి విజయానికి వెనుక నాన్న ప్రోత్సాహమేనన్న అనిత



అమరావతి, జూన్ 21 (మనప్రజాప్రతినిధి): ఫాదర్స్ డే సందర్భంగా రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తండ్రి గొప్పతనాన్ని గుర్తుచేసుకుంటూ హృదయపూర్వక సందేశాన్ని పంచుకున్నారు. మన కలలకు రెక్కలు తొడగడం కోసం తన జీవితాన్ని అంకితం చేసే వ్యక్తి తండ్రి అని పేర్కొంటూ ఆయన పాత్రను కొనియాడారు. తన రెక్కల కష్టాన్ని ధారపోసి పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే నిఖార్సైన వ్యక్తిత్వం తండ్రిదేనని అనిత అన్నారు. కుటుంబం కోసం ఎన్నో కష్టాలను భరిస్తూ, పిల్లల విజయాల కోసం నిరంతరం శ్రమించే ప్రతి తండ్రికి ఫాదర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు.అపజయాల సమయంలో ధైర్యాన్ని నింపుతూ, విజయాల సమయంలో నిశ్శబ్దంగా ఆనందపడే వ్యక్తి తండ్రి అని ఆమె పేర్కొన్నారు. పిల్లల జీవిత ప్రయాణంలో తొలి మార్గదర్శి, తొలి ఆదర్శం, తొలి గురువు తండ్రేనని అన్నారు. తండ్రి ప్రేమను మాటల్లో పూర్తిగా వ్యక్తపరచడం సాధ్యం కాదని అనిత అభిప్రాయపడ్డారు. కుటుంబం కోసం ఆయన చేసే త్యాగాలు, బాధ్యతలు, అంకితభావం అమూల్యమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ తండ్రి చేసిన సేవలను, త్యాగాలను గుర్తుంచుకోవాలని సూచించారు.సమాజంలో మంచి విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాయుత జీవనానికి తండ్రి చూపే మార్గదర్శకత్వం ఎంతో అవసరమని ఆమె తెలిపారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు తండ్రి ఇచ్చే ప్రోత్సాహం ఎంతో బలాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అన్ని తండ్రులకు ఫాదర్స్ డే శుభాకాంక్షలు తెలియజేసిన అనిత, వారి అనంతమైన ప్రేమకు, త్యాగాలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని పేర్కొన్నారు. కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడంలో తండ్రుల పాత్ర అమూల్యమని ఆమె అన్నారు.






# యోగ భారతదేశం ప్రపంచానికి ఇచ్చిన కానుక బండి సంజయ్

-కరీంనగర్‌లో ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు
-ప్రజలు, యువతతో కలిసి యోగాభ్యాసం
-ఆరోగ్యవంతమైన భారత నిర్మాణానికి యోగ అవసరం



కరీంనగర్, జూన్ 21 (మనప్రజాప్రతినిధి): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌లోని జ్యోతినగర్ మైదానంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొన్నారు. స్థానిక ప్రజలు, యువత, పార్టీ కార్యకర్తలతో కలిసి యోగాసనాలు వేసి యోగా ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన బండి సంజయ్, యోగ భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన కానుక అని పేర్కొన్నారు. వేల ఏళ్ల భారతీయ సంప్రదాయంలో భాగమైన యోగ నేడు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి ఆరోగ్యకర జీవన విధానంగా మారిందన్నారు. శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో యోగ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన చెప్పారు. ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, అనారోగ్య సమస్యలను అధిగమించడానికి యోగ అత్యంత ప్రభావవంతమైన సాధనమని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ యోగను తమ దినచర్యలో భాగం చేసుకోవాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు. రోజూ కొంత సమయం యోగాభ్యాసానికి కేటాయిస్తే ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని తెలిపారు. ఆరోగ్యకరమైన, దృఢమైన భారత నిర్మాణానికి యోగ ఉద్యమంగా మారాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవం "ఆరోగ్యవంతమైన వృద్ధాప్యానికి యోగ" అనే అంశంతో నిర్వహించడం ఎంతో సముచితమని ఆయన అభిప్రాయపడ్డారు. అన్ని వయసుల వారు యోగ సాధన చేయడం ద్వారా ఆరోగ్యంగా, చురుకుగా జీవించవచ్చని చెప్పారు.కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యోగ ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని వక్తలు పేర్కొన్నారు.

